# జీవచ్ఛవం

సీతకు నిద్రపట్టడంలేదు. మంచంమీద అటూ ఇటూ పొర్లింది. దిండు అనేకరకాలుగా మార్చింది. మంచం అన్ని మూలలకూ తిప్పింది. అరగంటసేపు ప్రయత్నించింది. పాపం సీతకు నిద్రిబట్టనే లేదు.

అప్పటికి రాత్రి పదిగంటలయింది. మెల్లిగా లేచి కిటికీ లోగుండా బైటికిచూసింది సీత. నవమినాటి గోము వెన్నెల ప్రియురాలి చిరునవ్వుకుమల్లే వుంది. చెట్లలో యిరుక్కునివున్న చీకటి బరువుగా వేళ్ళాడుతోంది, హిందూసంఘపు నీతికిమల్లే! సన్నగా మంచు కురుస్తూవుంది. దూరపు నగరంలోని విద్యుత్ కాంతులు కొండపక్కగా శ్వేతగా వెలుగుతున్నాయి. దూరంగా ఒక కుక్కఅరుపు గాలిలో మెలికలు తిరుగుతూ గీరుకుపోతూ వుంది.

"ఇప్పటికి అతను హాయిగా నిద్రపోతుంటాడు" అనుకొంది సీత.

కానీ అది అనుకోవడంగాదు. పక్కనే ఎవరన్నావుంటే ఆమాటలు ఖచ్చితంగా వాళ్ళకు వినిపించివుండేవి. కొంచెంగా గాలిగూడా సాగింది. ఆగాలి దురదగొండాకు పొడికిమల్లేవుంది సీతకు.

"ఛీ ఛీ" అనుకొని వెనక్కొచ్చింది

సీత వెనక్కొచ్చిన మరుక్షణంలో పెద్ద సుడిగాలి స్వరవ దూసుకొని కిటికీగుండా గదిలోకొచ్చింది. సీతకు గాలిమీద

చెడ్డకోపమొచ్చి కిటికీ వెయ్యబోయింది. అంతలోకి గదిలో కొచ్చిన సుడిగాలి మంచులాగా కరిగి వొకమనిషి ఆకారాన్ని ధరించింది. సీతకు భయంవేసింది. గుండెలు 'లబలబ' మన్నవి, వణికిపోయింది పాపం సీత.

సీత కంగారుచూసి ఆకారం నవ్వింది.

"భయపడబోకు సీతా!" అన్నది.

మనిషిమాదిరి మాట్లాడినందుకు సీత అంతగా భయపడలేదు. ఇది దయ్యంకాదని సీత నిర్ధారణ చేసుకుంది.

"ఎవరు నువ్వు?" అన్నది సీత.

"నన్నే ఎరగవ్?" అన్నది ఆకారం.

సీతకు నవ్వొచ్చింది. తనెవరో తెలిస్తే ఎందుకడుగుతుందీ? తనకు వెర్రా ఏమిటి?

"నీపేరేమిటి?"

"సీతమ్మ"

"నాపేరేనే!" అనుకొన్నది సీత.

"అతన్ని గురించేనా ఆలోచిస్తున్నావ్?"అన్నది ఆకారం.

"ఎవరు?"

"అదే...మూర్తి"

"ఎవరు చెప్పారు?"

"నాకు తెలుసు"

"నిజమే!"

"మరి పోలేదేం?" అన్నది ఆకారం వెటకారంగా.

"పోవాలి"

"నీకు పరువు అక్కర్లేదా?"

"కావాలి"

"మర్యాద?"

"కావాలి"

"గౌరవం, సంఘం?"

"కావాలి"

"అయితే నీమనసుని మార్చుకో"

"వొద్దు"

"ఎందుకని?"

"నా కా శక్తి లేదు"

"వుంది"

"నావల్లగాదు"

"అబద్ధం"

"నిజం! అతన్నాకు కావాలి"

"ఓహో"

"అతన్ని నేను కోరాను"

"అహ"

"ఈ ఆవేదనకి, ఆరాటానికి అతను నా క్కావాలి"

"అయితే వాటి శాంతికి...?"

"అవును"

"ఎంత నీచం?"

"కాదు"

"ఎట్లాకాదు? అయితే అది మంచిదా ఏమిటి?"

"మరి కాదా ఏమిటి?"

"నాకు తెలీదులే! అంత బిగ్గరిగా నేనాలోచించలేను. పోనీ చెప్పు, నీవరాల పీసుడుగ్గాను కట్టుకొన్న భర్తకు ద్రోహం చేస్తానంటావు, ఏం?"

"ఆపని చేయకపోవడంవల్ల నాకు నేనే ద్రోహం చేసుకున్నదాన్నవుతానేమో! నాకు జరిగే ద్రోహంకంటే నా మొగుడికి జరిగే ద్రోహం పెద్దదని నేననుకోలేదు"

"........."

"అతనికోసం నా ప్రత్యణువూ క్షోభిల్లిపోతూవుంది"

"నీప్రత్యణువు క్షోభిల్లిపోతూన్న ప్రతివాడితోటీ నీవు తిరుగుతానంటావు. ఆవిధంగా జీవితాన్ని నడుపుకొంటూపోతే నీభవిష్యత్తేమిటో,ఎట్లా వుంటుందో ఆలోచించావా?"

"ఆప్రశ్నకు అర్థంలేదు ఎందుకనంటే ప్రతివాణ్ణీ చూసినప్పుడూ అనుక్షణం క్షోభగా వుండదు. కొంతమందిని—మనస్సును అందుకోగల వున్నత వ్యక్తులను చూసినపుడుమాత్రమే అది సాధ్యపడుతుంది. అటువంటిది నిజంగా జరగటమనేది చాలా అరుదు"

"నిజమే కావొచ్చు. దాన్ని నువ్వు జాగ్రత్తచేసుకోవాలి...చూడు సీతా! ఇది కేవలం నీ క్షేమంకోసం చెబుతున్నాను. ఆలోచించు జాగ్రత్తగా. అతను నిన్ను నలిపేస్తాడు. నీఅందాన్ని అనుభవంకింద బారులుబారులుగా నొక్కి కొద్ది రోజుల్లోనే నిన్ను కురూపినిగా అసహ్యంగా తయారుచేస్తాడు. నీయవ్వనాన్ని దోసిళ్ళకొద్ది పీల్చి పిప్పిని బైటికి విసురుతాడు. అప్పుడు నీగతేమిటి? పశుప్రవృత్తికి గూడా పనికిరావు..."

"అంతదాకా రాదు."

"ఉండు—ఎందుకు రాము? అతను కోరింది నీఅందాన్ని, యవ్వనాన్ని, శరీరాన్ని. అది కొద్దిరోజుల్లోనే అతని పాదాల క్రింద వాంపులుగా నొక్కబడుతుంది. నిజం"

"అయితే నాభర్త చేసేదీ అదేగా! అయినా నాకావలిసింది అదే!! దాన్నే నాభర్తనుండి పొందలేకపోతున్నాను. నాభర్తకా శక్తిలేదు. ఉద్వేగాన్ని వుపశమింప చేసుకోవడం నాకర్తవ్యం. దానికోసం పెద్దలు, సంఘం నాకొక మొగవాణ్ని యిచ్చారు. తన కర్తవ్యాన్ని అతను నెరవేర్చలేకపోతున్నాడు. అందుకని నాకర్తవ్యాన్ని నేనెందుకు తోసెయ్యాలి? నాభర్తయొక్క తప్పుకుశిక్ష నేను అనుభవించడమెందుకో నాకు అర్థంగాకుండా వుంది."

"అవును, అర్థంగాదు పాపం! వాడు నిన్ను నలిపి, పీల్చి, తన కామాగ్నిలో నిన్ను బూడిదచేసినరోజున! ఆ బూడిద కుప్పలు చూసినప్పుడైనా నామాటలు నీకు అర్థం గాకపోవు..."

సీతకు హఠాత్తుగా జ్ఞాపకమొచ్చింది మధ్యలో ఎవరీ వ్యక్తి? సీతకు ఆ వ్యక్తి ఎవరో తెలీదు. ఆకారం సీత భవిష్యత్తు. జవాబులిచ్చింది సీత వర్తమానం. వర్తమాన భవిష్యత్తులే యింతసేపూ ఘర్షణపడినాయి. సీత నిర్లిప్తంగానే వుంది. వర్తమానం వయస్సు 20 ఏళ్ళకు కొంచెం ఎక్కువ. భవిష్యత్తు వయస్సు 45 కు కొంచెం తక్కువ అప్పటికి.

"చెడిపోతావ్! మార్చుకో!"అన్నది ఆకారంలోవున్న భవిష్యత్తు.

"మారదు" అన్నది నిశ్చలంగా సీతలోవున్న వర్తమానం.

"మారదు! మారదు!! మారదు!!!"

"చూస్తాను"

ఆకారం కుడిచెయ్యిని వలయంగా తిప్పింది. అంతదూరమూ బ్రహ్మాండమయిన మంటలు లేచినవి. ఆ మంటలచివర యమలోకం వెలిసింది. పాపుల (?) మొహాలకు వారివారి దోషాలను తెలిపే అట్టలు కట్టబడివున్నవి. ఒకావిడ మొఖానికి "స్వేచ్ఛాప్రియ" అనేఅట్ట తగిలించివుంది. ఒక భటుడు (రవి వర్మ గెటప్) ఆవిణ్ణి కత్తితో పొడిచాడు. సలసల వేగే నూనెలో వేయించాడు. మంత్రగబ్బలచే కరిపించాడు, యినప గద్దలతో రక్కించాడు. రెండుకాళ్ళు పుచ్చుకొని పైకెగరేసి కింద ఎర్రగా కాలిన బల్లెం పెట్టాడు "స్వేచ్ఛాప్రియ" రివ్వున వొచ్చి కసిక్కిన దానికి దిగబడింది.

"హాఁ!"

వర్తమానం మూర్ఛబోయింది. భవిష్యత్తు వలయాన్ని వుపసంహరించింది. మంటలు ఆగిపోయినయ్. యమలోకం అదృశ్యమైంది. ఆకారంలోవున్న భవిష్యత్తు మంచులాగా కూడుకుని సుడిగాలిలో కలసి సన్నరన కిటికీలోగుండా దూసుకొని బైటికి వెళ్ళింది.

అరగంటకుగానీ వర్తమానం తేరుకోలేదు. అప్పటికి సముద్రంలోని నీరు వుప్పు. చంద్రుడు వెన్నెల కురుస్తూనే వున్నాడు——

ఇంతవరకూ నిర్లిప్తంగా వున్న సీత వొణికిపోయింది.

"ప్రాణనాయకా! క్షమించు"అంటూ తనుఅసహ్యించుకొన్న మొగుణ్ణే గట్టిగాకావిలించుకొని కళ్ళుమూసుకొంది సీత.